# * కృతజ్ఞతాంజలి **

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ప్రాచ్యపరిశోధన సంస్థలో పరిశోధన చేయడానికి నాకు అవకాశం కల్పించిన నిత్య సంతోషి, సంస్కృతాంధ్ర భాషాకోవిదులు, ప్రాచ్యపరిశోధన సంస్థ సంచాలకులు ఆచార్య వేమూరి వెంకటరమణారెడ్డి గారికి హృదయపూర్వక నమస్కారాలు.

'తమ పర్యవేక్షణలో పరిశోధన చేయాలనుంది' అని అడిగిన వెంటనే నిండు మనస్సుతో అంగీకరించి, నా అభిలాషను గుర్తించి, తగిన పరిశోధనాంశాన్ని సూచించి, సునిశిత పరిశీలనతో విలువైన సూచనలిస్తూ ఈ సిద్ధాంతగ్రంథానికి ఒక సమగ్రరూపం సమకూర్చిన మా గురువులు డా॥ పి.సి. వెంకటేశ్వర్లు గారికి ధన్యవాదాలు.

ఈ సిద్ధాంతవ్యాస సమర్పణకు సంబంధించి పలు సందర్భాల్లో ఆత్మీయతతో సలహాలిచ్చిన యస్.వి.యు. ఆర్ట్స్ కళాశాల అధ్యక్షులు ఆచార్య డి. కిరణ్ క్రాంత్ చౌదరి గారికి, తెలుగు బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ ఆచార్య కవరపల్లి మునిరత్నం గారికి నా మనఃపూర్వక కృతజ్ఞతలు.

నాలో పరిశోధనా కుతూహలాన్ని కలిగించి, ఆదినుంచి అంతందాకా తోడుగా నిలిచి, ఆర్థికంగా తోడ్పాటునందించిన మాన్యులు డా॥ ఎం. మునిరత్నం గారి ఋణం ఎప్పటికీ తీర్చుకోలేను. వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు.

తాను పరిష్కరించిన 'కాళిందీ కల్యాణం' పై పరిశోధన చేస్తున్నానని తెలిసి సంతోషంతో పరిశోధనాంశం గురించి విడమరిచి చెప్పిన పెద్దలు డా॥ ఏలవర్తి చంద్రమౌళి గారికి నమస్కారాలు.

ఈ పరిశోధనా గ్రంథంలో భాషా విన్యాసాల గురించి సందేహాలను తీర్చిన నిరాడంబరులు, భాషాశాస్త్ర విభాగం అధ్యక్షులు ఆచార్య గారి రాధాకృష్ణ గారికి వినయాంజలి.

సంప్రదాయ సాహిత్యం పై మక్కువ గలిగేలా, అడిగినదే తడవుగా నాకు కలిగిన సందేహాలను నివృత్తి చేసిన శ్రీ వల్లమూడి గిరిధర్ కుమార్ గారికి ధన్యవాదాలు.

నా పరిశోధన కాలంలో పలు సందర్భాల్లో పలు విధాలుగా తమ సహాయ సహకారాలందించిన ఆచార్య బిట్రాజు-గోవిందరాజు, డా॥ ముదివేడు ప్రభాకరరావు గార్లకు నా నమస్సుమాంజలి.

నా పరిశోధనకవసరమైన తాళపత్రాలను, అమూల్య గ్రంథాలను ఇచ్చిన ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథాలయ సంరక్షకులు డా॥ జ్ఞానప్రకాశం నాయుడు, శ్రీ కేశవరెడ్డి, డా॥ గురుమూర్తి గార్లకు, విశ్వవిద్యాలయ తెలుగు విభాగం గ్రంథాలయోద్యోగి శ్రీ షణ్ముగం గార్లకు ప్రత్యేకాభివందనాలు.

ఈ పరిశోధనలో సహకరించిన ప్రాచ్య పరిశోధన సంస్థ కార్యాలయ సిబ్బంది నరసింహం, గంగాసువర్ణ, బాషా, శోభన్, రమేష్ గార్లకు కృతజ్ఞతలు.

నాకు మాతృత్వాన్నిచ్చి మమకారాన్నే గాక సంస్కారాన్ని కూడా నేర్పిన మా అమ్మ టి. పాపమ్మకు, నాకు జన్మాన్నే గాక వ్యక్తిత్వాన్నిచ్చిన మా నాన్న కీ॥శే॥ తొండాట సిద్దయ్యకు, నేను పిహెచ్.డి. చేయడానికి కారణమైన మా అన్న మునిరత్నం, వదిన పుష్పరాణి గార్లకు, తాము పాలేర్లుగా మారి నన్ను చదివించిన మా అన్నలు బాలాజి, నాగరాజ, సురేంద్రబాబు, అక్కయ్యలు భారతి, సుజాతలకు నా పాదాభివందనాలు.

బాల్యంనుండి నీడలా నా వెన్నంటి వున్న మిత్రుడు డా॥ కె. సుబ్రమణ్యంకు, నా పరిశోధన సమయంలో సహకరించిన మిత్రులు డా॥ సీతాకళ్యాణి, సి. ఏసయ్య, ఆర్. వి. శేషగిరి, కె. చంద్రశేఖర్, అశోక్, యస్. ధనంజులయ్య, ధనశ్రీ, చిరంజీవి, గోవిందులకు ధన్యవాదాలు.

ముఖ్యంగా ఈ అక్షర యజ్ఞంలో ఈ సిద్ధాంత వ్యాసాన్ని అచిర కాలంలో అందంగా రాసిచ్చిన శ్రీ సయ్యద్ జాఫర్ గారికి ఋణపడి ఉంటాను.

పరిశోధనలో కొత్త అడుగులు వేస్తూ ముందుకు వెళ్తున్న సమయంలో స్వర్గస్థుడైన నా పరిశోధక మిత్రుడు యానాది-బాబు దివ్యస్మృతిని స్మరిస్తున్నాను.

టి. రాజశేఖర్

# ఉపోద్ఘాతం

మన ప్రాచీన కవులు సృష్టించిన పురాణ, కావ్య, ప్రబంధ, శతక, యక్షగాన, సంకీర్తన, నాటకాది సాహిత్యాలతో తెలుగు సరస్వతి పులకించింది. అలా రచింపబడ్డ కావ్యాల్లో వెలుగులోకి వచ్చినవి కొన్నైతే రావలసినవి మరెన్నో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. వెలుగులోకిరాని ఎన్నో కావ్యాలు కాలగర్భంలో కలిసిపోగా, మిగిలిన అమూల్యమైన కావ్యసంపద ప్రాచ్యపరిశోధన సంస్థలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ఆ కావ్యసంపదలోనుండి తుముండపాపకవి రాసిన కాళిందీ కల్యాణాన్ని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధన సంస్థ 2010 వ సం॥లో ప్రచురించింది. దీన్ని డా॥ ఎలవర్తి చంద్రమౌళి పరిష్కరించారు.

మన సాంస్కృతిక జీవనంలో శుభానికి, ఆనందానికి అధిక ప్రాధాన్యత ఉంది. ఇదే సంప్రదాయం మన సాహిత్యంలోను కనిపిస్తుంది. పాశ్చాత్యుల్లాగా విషాదాంత కావ్యాలు రాయటం మన ప్రాచీన కవులకు ఇష్టముండదని ఎందరో విమర్శకులు నిర్ధారించారు. మన సాహిత్యంలో వచ్చిన కావ్యాలన్నీ దాదాపుగా ఆనందంతో గానీ, ఉపదేశంతో గానీ పూర్తవుతాయని మనం అర్థం చేసుకోవాలి. ఆ క్రమంలో కావ్యం ఆద్యంతాలు శుభకరంగా ఉండే కల్యాణకావ్యాలు రాయబడ్డాయి. దక్షిణాంధ్ర యుగం తర్వాత సంధియుగంలో ఈ కల్యాణ కావ్య

సంప్రదాయం ఉప్పెనలా సాగింది. ఆ సంప్రదాయ పరంపరలో వచ్చిందే కాళింది కల్యాణం.

ఈ కాళింది కల్యాణం రాసింది తుమురాడ పాపకవి. ఈ కవి మొత్తం మూడు రచనలు చేశాడు. అందులో మొదటిది కాళింది కల్యాణం కాగా, రెండవది రామకథా సుధార్ణవం, మూడవది వైరాగ్యదర్పణం. వాటిలో సంపూర్ణంగా కావ్యరూపంలో ముద్రితమైన కాళింది కల్యాణాన్ని పరిశోధనాంశంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ పరిశోధన కాళింది కల్యాణ కావ్యవిశ్లేషణకు మాత్రమే పరిమితమై సాగుతుంది.

'తుమురాడ పాపకవి కాళింది కల్యాణం - పరిశీలన' అనే ఈ సిద్ధాంత గ్రంథాన్ని పరిశోధనా సౌలభ్యం కోసం ఆరు అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

మొదటి అధ్యాయమైన 'తెలుగులో కల్యాణకావ్యాలు'లో కల్యాణ కావ్యాలు ఎందుకు రాయబడ్డాయో పరిచయం చేస్తూ, కల్యాణానికి అర్థం, నిర్వచనం, వివాహం - ప్రారంభం, వివాహాల్లో రకాలు వివరించడం జరిగింది. తర్వాత భారత భాగవత రామాయణాల్లో కల్యాణఘట్టాల్ని, కావ్యాలైన కుమార సంభవం, శృంగార నైషధం, శృంగార శాకుంతలం వంటి గ్రంథాల్లోని కల్యాణాలను రేఖామాత్రంగా చెప్పడం జరిగింది. అలాగే ప్రబంధాలైన మనుచరిత్ర,

వసుచరిత్ర, ఆముక్తమాల్యదల్లోని కల్యాణాలను పరామర్శించడం జరిగింది. తర్వాత కల్యాణ కావ్య లక్షణాలను వివరించి, తెలుగులో నాయికానామంతో రాయబడ్డ కల్యాణకావ్యాలను, ప్రబంధాలను గురించి వివరాలివ్వబడ్డాయి.

రెండో అధ్యాయమైన 'కాళిందీ కల్యాణం - కవి - కాలం - అవతారికా విశేషాలు' లో కాళిందీ కల్యాణ తాళపత్ర గ్రంథ వివరాలు, దాన్ని రచించిన పాపకవి వంశం, జన్మస్థలం, వివిధ ఆధారాల ద్వారా కాలం నిర్ణయించడం జరిగింది. అలాగే కాళిందీ కల్యాణం అవతారికలోని ఇష్టదేవతాస్తుతి - గురుస్తుతి - సుకవిస్తుతి - కుకవి నింద - కృతిప్రేరకుని వంశవర్ణన - కృతిప్రేరకుని స్వప్నవృత్తాంతం - కావ్యోత్పత్తి ప్రశంస - షష్ఠ్యంతాల్లోని విశేషాలను గురించి విపులంగా చర్చించడం జరిగింది.

'పాపకవి కాళిందీ కల్యాణం - ఇతర కాళిందీ కల్యాణాలు' అనే మూడో అధ్యాయంలో పాపకవి కాళిందీ కల్యాణ కావ్యం మూడాశ్వాసాల్లోని ఇతివృత్తాన్ని పరిచయం చేశాను. అలాగే తెలుగు సాహిత్యంలో అరదుజనుకు పైగా వచ్చిన ఇతర కాళిందీ కల్యాణాలను నాకు లభించినంత వరకు పరిశీలించి తులనాత్మకంగా అధ్యయనం చేశాను.

నాల్గో అధ్యాయమైన 'కాళిందీ కల్యాణం ప్రబంధ లక్షణ సమన్వయం' లో ప్రాచీనాంధ్ర వాఙ్మయాల్లో ప్రబంధ శబ్దాన్ని కవులు ఎలా ప్రయోగించారో పరిచయం చేసి, ప్రబంధ నిర్వచనాలను వివరించాను. ప్రబంధా లక్షణాలైన మిశ్రమ ఇతివృత్తం, ఏకనాయకాశ్రయం, వస్త్వైక్యం, శృంగారరసప్రధానం, అష్టాదశ వర్ణనలు, ఆలంకారిక శైలి, సన్నివేశకల్పన, స్వతంత్ర కావ్యం అనే లక్షణాలు కాళిందీ కల్యాణ ప్రబంధంలో ఎంత వరకు ఉన్నాయో వివరంగా పరిశీలించాను.

'కాళిందీ కల్యాణం - పాత్రచిత్రణ' అనే ఐదవ అధ్యాయంలో - కావ్యనిర్మాణంలో పాత్రచిత్రణ ఎంతవరకు ప్రాముఖ్యత వహిస్తుందో వివరించి కాళిందీ కల్యాణం లోని పురుష పాత్రలైన శ్రీకృష్ణుడు, అర్జునుడు, సూర్యుడు, రోమపాదుడు, స్త్రీ పాత్రలైన కాళింది, వారవనితలు, శాంత వంటి పాత్రలనే గాకుండా, చిన్న పాత్రలైన పురపెద్దలు, నారదుడు, అక్రూరుడు, సత్రాజిత్తు, శతధన్వుడు, జాంబవంతుడు మొదలైన పాత్రలను కవి ఎంత నేర్పుతో సృష్టించాడో వివరించాను.

'కాళిందీ కల్యాణం - సామాజిక, భాష, ఛందోలంకార విషయాలు' అనే ఆరో అధ్యాయంలో - కావ్యం లోని

సామాజిక విషయాలను , భాషా విషయాలను , శబ్దార్థాలంకారాలను , ఛందో విషయాలను పరిశీలించి వివరాలను పొందుపరిచాను .

ఈ అధ్యయనం ద్వారా పరిశోధించి నిగ్గుతేల్చిన విషయాల సారాంశాన్ని ఉపసంహారంలో వివరించాను.
ఈ సిద్ధాంత గ్రంథం చివరిలో పరిశోధనకు ఉపకరించిన గ్రంథాల పట్టికను అకారాది క్రమంలో కూర్చడం జరిగింది .